# వైభవంగా సుదర్శన నారసింహ హోమం


సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. సుమారు గంటపాటు నిత్య సుదర్శన హవనం నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన నారసింహ హోమం అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్య కల్యాణ తంతు జరిపించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు.

**● శాస్త్రోక్తంగా ధనుర్మాసోత్సవాలు**

ధనుర్మాసోత్సవ వేడుకలను ఘనంగా కొనసాగుతున్నాయి. వేద మంత్రాలు పఠిస్తూ తిరుప్పావై పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోదాదేవి రంగనాయకుడిపై రచించిన పాశురాలను పఠించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 16,47,443 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

**నేడు హుండీల లెక్కింపు**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి హుండీల లెక్కింపు గురువారం చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు. ఉదయం 7గంటలకు కొండ కింద వ్రత మండపంలో లెక్కింపు ప్రారంభిస్తామని తెలిపారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

# గ్రామాల్లో అభివృద్ధిని కొనసాగించాలి

**● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట రూరల్, జనవరి 3 :పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పనులకు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దాడులను ఆదిలోనే అరికట్టాలి

**● బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం**
**● మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్**


దవాఖానలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దీపిక

సూర్యాపేట టౌన్, జనవరి 3 : బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ అరాచక శక్తులపై చర్యలు చేపట్టి.. దాడులను ఆదిలోనే అరికట్టాలని, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించకూడదని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి, కాసర్లపహాడ్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలను బుధవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తుంగతుర్తిలో కాంగ్రెస్ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో రక్తపుటేరులు పారినచోట బీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలు పారించి అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ పార్టీ తిరిగి ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. నోటికొచ్చినట్లు హామీలిచ్చి ఇప్పుడు నెరవేర్చలేక ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. తస్మాత్ జాగ్రత్త.. దాడులు ఆపకపోతే ప్రజాక్షేత్రంలో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్యపడొద్దని అండగా ఉంటామని, ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలు చేరేవరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. పరామర్శించిన వారిలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, జడ్పీటీసీలు దావుల వీరప్రసాద్ యాదవ్, కందాల దామోదర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్, పార్టీ మండల అధ్యక్షుడు సంకినేపల్లి రఘునందన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న బీఐఎస్ రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ.రావు

# ఐఎస్ఐ మార్కుతో వస్తువుల నాణ్యత పరిశీలన

**● బీఐఎస్ రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ.రావు**

భువనగిరి అర్బన్, జనవరి 3 : ఐఎస్ఐ మార్కుతో వస్తువుల నాణ్యత, ప్రామాణికతలను తనిఖీ చేస్తారని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఐఎస్) రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ.రావు అన్నారు. మండలంలోని అనంతారం బీసీ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులకు ఐఎస్ఐ మార్క్‌పై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వివిధ వస్తువుల నాణ్యత, ప్రామాణికతను తనిఖీకి ఐఎస్ఐ మార్కు ఉపయోగిస్తారన్నారు. బంగారం యొక్క స్వచ్ఛతకు హాల్ మార్క్, వ్యవసాయ వస్తువుల నాణ్యతకు అగ్రి మార్కు, ఎలక్ట్రానిక్ వస్తువులకై ఎస్ మార్కు మనకు నిత్య జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ఐఎస్ఐ మార్కు లేని వస్తువులు మార్కెట్లో కనిపిస్తే బీఐఎస్ కేర్ ఆఫ్ ద్వారా సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులకు స్టాండర్డ్ రైటింగ్ కాంపిటీషన్, పోస్టర్‌మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్స్, బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తన్నీరు, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి, హెచ్ఎం పి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏటీపీ మెగా, డీడబ్ల్యూ రజిత, అధ్యాపకులు మహేశ్, వహీద్, దశరథ, శ్రీను, ఝాన్సీ, శ్రీవాణి, శ్రీలత, కృష్ణ, బాలు, ఖాదర్, కిరణ్ పాల్గొన్నారు.

### సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి : డీఆర్‌డీఓ

భువనగిరి సిటీ / భువనగిరి అర్బన్, జనవరి 3 : లబ్ధిదారులు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధిఅధికారి(డీఆర్‌డీఓ) నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జనవరిలో జరిగే సదరం క్యాంపు రెన్యూవల్ దరఖాస్తులు, కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాలనుకునే వారు సంబంధిత మండలంలో గల మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మీసేవలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సదరం క్యాంపులో సంబంధిత డాక్టర్ల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5,6,9,11,18,20,27,30వ తేదీల్లో ఆర్థోపెడిక్, కంటి లోపం, మానసిక రుగ్మత, వినికిడి లోపం ఉన్న వారు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. మోకాళ్ల నొప్పులు, వంటి నొప్పులు, ముసలి తనముతో బాధపడుతున్న వారు, గుండె, కిడ్నీ, లివర్, క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారు సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోకూడదన్నారు. అర్హత ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డాక్టర్ల బృందం పరీక్ష నిర్వహించి వికలత్వ శాతాన్ని నిర్ధారించిన తర్వాతనే సదరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మీసేవ కేంద్రంలో బుక్ చేసుకున్న తేదీ నాడు మాత్రమే సంబంధిత దివ్యాంగులు ఏరియా హాస్పటల్ భువనగిరిలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. మీసేవలో స్లాట్స్ తేదీ 2024 జనవరి4న ఉదయము 11గంటలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.


సైన్స్ ఫెయిర్ ముగింపు సభలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

# ముగిసిన సైన్స్ ఫెయిర్

**● ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన**

మిర్యాలగూడ రూరల్, జనవరి 3 : మండలంలోని అవంతీపురం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎస్టీ గురుకుల పాఠశాలల సైన్స్ ఫెయిర్ బుధవారం ముగిసింది. విద్యార్థులు ఆవిష్కరించిన పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ముగింపు సమావేశంలో పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్టీ గురుకుల పాఠశాలల రీజినల్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మయ్య, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

# శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

**ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి**

చౌటుప్పల్, జనవరి 3 : శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి వ్యాయామ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎంజీయూ అంతర్ కళాశాలల క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్టర్ ఓఎస్‌డీ టూ వీసీ అల్వాల రవి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ ఉపేందర్, వ్యాయామ కళాశాల అధ్యాపకులు సత్యనారాయణ, పి.శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.